ఉచితముగానో, తక్కువ జీతములకో నియోగించవచ్చును. గ్రామములలో ప్రచారము చేసి అక్కడ పనిలేనివారి సహాయము పొందవచ్చు. ఉత్సాహపూరితులైన యువకులను, విద్యార్థులను ఉపయోగించుకొను ఉద్యమము నడుపుటకు మన నాయకత్వమునకు తగిన పలుకుబడి లేకపోలేదు. ఇంకొక విషయం. కాశ్మీరులో సైనికులను కూడా వ్యవసాయ కార్యక్రమాలలో ఉపయోగించుకున్నారు. రాయలసీమలో స్వల్ప కాలములోనే వారి చేసిన కృషి అభినందించదగినది. మనము సంవత్సరమునకు 290 కోట్ల రూపాయలు రక్షణకై ఖర్చు చేస్తున్నాం. వారిసేవను శాంతి సమయంలో కూడా ఉపయోగించుకొనినప్పుడే వారు మనదేశరక్షణకు సౌభాగ్యమునకు నిజంగా బాధ్యత వహించిన వారవుతారు.

జూలై మొదటి వారంలో ఆధికాహారోత్పత్తి విచారణ సంఘం ఒక నివేదిక దాఖలు చేసింది. ఇదివరలో జరిగిన అభివృద్ధి కార్యక్రమమంతా వ్యవసాయము కిందనున్న భూమిలో సుమారు 4% భూమిమీద మాత్రమే కేంద్రీకరించబడిందని, అందువల్ల మిగత స్థలములలో కలిగిన అనర్థము చాలావరకు ఈ ప్రత్యేక స్థలములలోని అభివృద్ధిని మించడము జరిగిందని, ఆ సంఘం పేర్కొంది. గ్రామ పునరుద్ధారణకి, అధికాహారోత్పత్తికి గాఢమైన సంబంధమున్నదని చెబుతూ, గ్రామప్రజల మంచి చెడ్డలను గమనించడానికి ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ శాఖను నిర్మించాలని సిఫార్సు చేసింది. ఈ శాఖ నిర్మించడము పూర్తి అవడానికి పది సంవత్సరము అవుతుంది. ఇందుకు గ్రామము ఒక్కింటికి 300 రూపాయల చొప్పున 5 లక్షల గ్రామములకు సుమారు 150 కోట్ల రూపాయలు వ్యయమగును. ప్రభుత్వశాఖలను నిర్మించుటవలననే ప్రజాభివృద్ధి కలుగుననుకొనుట పట్టి భ్రమ. ఆ శాఖ నిర్వహణపై అగు వ్యయమునకంటె ఐదు లేక పదిరెట్లు (అనగా 750 లేక 1500 కోట్ల రూపాయలు) వ్యయము అసలు కార్యక్రమముపై చేయగల సామర్థ్యమున్నప్పుడే ఆ శాఖ నిర్మించడంలో అర్థముంటుంది.

ఈ చర్చలవల బోధపడు విషయము, ప్రస్తుతము ఆహార సమస్యను పరిష్కరించడానికి, దేశాన్ని స్వయం సమృద్ధిగా చేయడానికి ఒక సరియైన కార్యక్రమము నేటి మన ప్రభుత్వానికి లేదని. అందుచేత వారి కృషి ఇదివరకు వలెనే తిరిగి విఫలమైతే (విఫలము కావాలని ఎవరికోరికా కాదు) వెనుకటి కారణాలు కాక ఇంకొక పర్యాయము చెల్లిస్తే వారు క్షమించరాని తప్పు చేసినవారవుతారు. సకాలంలో మన ప్రభుత్వము వారు ఈ విషయాన్ని గుర్తించాలి.

స్కెచ్

# తావులు తెచ్చే తలపులు

వసంతలక్ష్మి

పిడేలు తీగలు సవరించినట్లు ధ్వని వినపడి చటుక్కున వెనక్కు తిరిగాడు ప్రభాకరరావు.

"త్వరగానే వచ్చేస్తారు కదూ!"

అరవిచ్చిన గులాబిమొగ్గవలె సిగ్గుతో, ప్రేమతో భర్తవంక చూస్తూ నుంచునివుంది లీలావతి.

"అలాగే" అంటూ మృదువుగా లీలావతి తల నిమిరాడు. తాచుపాములాంటి ఆ జడలో తురిమిన సంపంగి పూలచెండు చేతికి తగిలింది. శిరస్సు ఆప్యాయంగా మూర్కొని ఆఘ్రాణించాడు. ఆ చెండు అలాగే తీసి భర్త చేతికిచ్చి సాగనంపింది లీలావతి. అప్పుడే క్రొత్తగా తొడిగిన తెల్లని లాల్చీ ప్రభాకరరావు వంటిమీద గాలికి రెపరెప కొట్టుకున్నది.

నూత్నవధూప్రేమచిహ్నమైన పూలచెండు మాటిమాటికి వేలికి తగిలించి చుట్టూ తిప్పుతూ, మధ్యమధ్య సువాసన నాఘ్రాణిస్తూ

స్నేహబృందమంతా చేరారేమోనన్న ఆత్రుతతో త్వరత్వరగా అడుగులు వేస్తూ నదిగట్టు వేపు నడిచాడు. కాని అక్కడ అనుకున్నవారెవరూ కనపడలేదు. ఒక్క సుధాకరం మాత్రం మ్లానవదనంతో, విచారంగా నీళ్ళకేసి చూస్తూ కూర్చుని వున్నాడు ప్రభాకరరావుకిది కొత్త కాదు కనుక యేవిధమైన ఆందోళనా కనబర్చకుండా అతని ప్రక్కన వచ్చి కూర్చున్నాడు.

తను వచ్చినట్లు తెల్పడానికి రెండుసార్లు పొడిగా దగ్గి, "ఏమోయ్! మనవాళ్లెవరూ రాలేదేం?" అని అడిగాడు. ఇంకా పరధ్యానంలో నే "ఆఁ... రాలేదు" అంటూ అతనివైపు తిరిగిన సుధాకరం—అతని చేతిలోని సంపంగిదండ చూడగానే, అగ్నిగుండంలో పడినట్లు బాధపడుతూ ఆ చెండు లాగి నలిపి విసిరి నదీజలంలో పడవేశాడు. స్నేహితుని పనికి ప్రభాకరం మనస్సు చాలా బాధపడినా, మిత్రుడు దేనికంత బాధపడుతున్నాడో తెలుసుకోవాలని విపరీతంగా మథనపడ్డాడు.

ఇంతలో మిత్రుడు ఉవ్వెత్తుగా పొంగిన విచారంతో కలవరపడి లేచి నదీప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆ పూలదండ తెచ్చుకుని హృదయానికి హత్తుకుని ఘోరంగా విలపిస్తున్నాడు.

స్నేహితుని ఈ దీనావస్థకూ, విచిత్ర ప్రవర్తనకూ మరెంతో ఆశ్చర్యపోయి, అతని బాధకు కారణం చెప్పమని ప్రభాకరరావు యెన్నో విధాల అనునయించి అడిగాడు.

ఏ మనస్థితిలో వున్నాడోగాని సుధాకరం చెప్పటానికియిష్టపడ్డాడు. ఆ యిసుకలో బోర్లగిల పడుకుని ముఖం కప్పుకుని ప్రారంభించాడు.

* * *

"ప్రభాకర్, నీకు తెలుసుకదూ? మధురవాసనలు మధుర స్మృతులను మతికి తెస్తాయన్న సంగతి! ఈ వేళ నీవలాగే నా గతదివ్యజీవితం తలపోసుకొని విలపించాల్సివచ్చింది.

సరిగా యేడాదిక్రితం—యివే రోజుల్లో నేను తండ్రి నౌతానని గర్వించేవాడిని. ఆ వేళ మా ఆవిడ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. "ఈ క్షణంలోనో మరో క్షణంలోనో పాప పుట్టేటట్లున్నాడు. మిమ్మల్నొకసారి చూడాలని చాలా కోరికగా వున్నది. వస్తారు కదూ? వచ్చేటప్పుడు నాకు సంపంగి పూలు తెచ్చిపెట్టండి" అని వ్రాసింది. మా యిద్దరి అనురాగ దాంపత్యానికి యీర్ష్యపడేసంఘం నన్ను భార్యాలోలుడంది. అలాంటి నేను ఆ వుత్తరం చూచుకున్నాక వుండగలనా? బయలుదేరాను—పువ్వుల చెండుకొని తడిగడ్డలో చుట్టి సంచీలో పెట్టాను.

రైలు స్టేషనులో ఆగింది. ఏదో ఆనందంతో గుండెలు తటతటలాడుతున్నాయి నాకు. పెట్టె దించుకుని యింటికి పరిగెత్తాను. సరిగా సమయానికి చేరాను. నా రత్నం ప్రసవవేదన పడుతూ నన్ను చూడగానే యేబాధా లేనట్లు చిన్నగా నవ్వింది మెల్లగా "పూలు తెచ్చారా? ఏదీ యిటు యివ్వండి" అని చేయి జాపింది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది చేతిసంచీ. ఏం చేయను? ముఖం చిన్నబుచ్చుకుని ఆలసిన కళ్లు బరువుగా మూసింది.

ఆ వేళ నాకు దుర్దినం, నేను తెచ్చిన పూలు పోవడమే నా దురదృష్టానికి సూచన. ఆనాడు జీవితంలో ప్రియతమమైన వ్యక్తిని పోగొట్టుకున్నాను. జీవితాంతం మరిచిపోని గాథగా, మాయని బాధగా చేసి నా రత్నాన్ని దివికి లాక్కుని వెళ్ళింది విధి. ఏదైనా మరుపు రావచ్చునుగాని ఈ సంపంగి పూల విషయం, ఆ బాధాచ్ఛాదిత వదనంపై అంత్యఘడియల్లో ఆ నిరుత్సాహం, యెన్నటికీ మరువలేను. నన్ను విడిచిపోతూ నన్నడిగిన చిన్నకోరిక తీర్చలేని నిర్భాగ్యుణ్ణి - నన్ను నేనే యెంత నిందించుకున్నాను! ఆ పువ్వు కనపడితే నన్ను బ్రతికి వుండగానే చెరుకు గనుగలో వేసి త్రిప్పినట్లుంటుందోయ్ ప్రభాకర్!"—అంటూ చెట్టంత మనిషీ పసిపిల్లడిలాగా వలవల లాడేడు.

మనస్సును కలచివేసే బాధాకరమైన యీ విషాద గాథను తలపోసుకుంటూ యిల్లు చేరిన ప్రభాకరరావు కండ్లయెదుట మరొక సంపంగి దండతో లీలావతి హాజరైనది.

జీవితపు పరిణామం—దాని తత్వం, ఏమిటో అప్పటికీ యిప్పటికీ ప్రభాకరరావుకి అర్థమవలేదు.